క్లుప్తంగా

ఆరోగ్య మహాసభలకు ఆహ్వానం..



డీఎస్పీని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: ఈనెల 23వ తేదీన కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న ఆరోగ్య మహాసభలను రావాలని ఆదివారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శనిగ వెంకటేశ్వరావు, సుగుణరావు, మొక్కల వెంకటయ్య, బండారి శంకర్, దయానందసాగర్ ఉన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి

ఇల్లెందు: పట్టణంలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డు ఆర్యవైశ్య శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, అనుబాబు, సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్లు రద్దు చేయాలి

ఇల్లెందు: సింగరేణిలో చీఫ్ మెడికల్, సెక్యూరిటీ అధికారుల నియామకానికి విడుదల చేసిన నోటిఫికేషన్లు రద్దు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అధికారుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశారని, వాటి స్థానంలో సింగరేణిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అనుభవం కలిగిన వారికి అవకాశం ఇవ్వాలని విన్నవించారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి అధికారుల, కార్మికుల మనోభావాలను కాపాడాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి సంస్థ నిబంధనలను మార్చవద్దని, ఇటీవల సంస్థ జారీ చేసిన అవుట్ సోర్సింగ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్, సెక్యూరిటీ పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు.

మంత్రికి వినతి

ఇల్లెందు: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఇల్లెందు విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఆదివారం ఇల్లెందుకు వచ్చిన సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్‌నబీ వినతిపత్రం అందజేశారు. సీతారామ ప్రాజెక్టు పాత డిజైన్ ప్రకారం ఇల్లెందుకు నీరు ఇవ్వాలని, రెవెన్యూ డివిజన్, రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు



నాగపూర్‌లో మాట్లాడుతున్న విజయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: మిడ్ డే మీల్స్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి అన్నారు. నాగపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మిడ్ డే మీల్స్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో కొత్తగూడెం నుంచి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాపితంగా మధ్యాహ్నం భోజన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో దేశవ్యాపితంగా మధ్యాహ్న భోజన కార్మికులు సంఘటితమై పోరాటం చేయనున్నట్లు వివరించారు.

నిత్యావసరాలు అందజేత

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడు తండాకు చెందిన లావుడ్యా శాంతి ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సమితి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిగాని రాజు, మహిళా చైర్మన్ అంజలిరెడ్డి సహకారంతో తంబర్ల నరసింహారావు బాధితురాలికి ఆదివారం నిత్యావసరాలను అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: ఈనెల 6న తావుర్యా తండాలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొక్కంపాడు జట్టుపై రాజ్11 విజయం సాధించింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి, షీల్డ్‌లు అందజేశారు.

చెత్త తీయరు.. వీధిలైట్లు వెలగవు

కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం జనవరితో ముగియడంతో ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతోంది. మున్సిపాలిటీలో ప్రశ్నించే ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పాలన ఇష్టానుసారంగా నడుస్తోంది. ప్రజల కనీస సౌకర్యాలను పట్టించుకునే నాథుడే లేడు. వార్డు ఆఫీసర్లు, స్పెషలాఫీసర్లు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆస్తి పన్నులు, పంపు బిల్లులపై పెట్టిన శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- రెండు రోజులకోసారి పంపులు
- కుక్కలు, కోతులతో అవస్థలు
- మూలనపడుతున్న మున్సిపల్ వాహనాలు
- ప్రశ్నించే వారు లేకపోవడంతో ఇష్టానుసారం..





మేదరబస్తీలో ఖాళీ స్థలంలో చెత్తాచెదారం, మూలన పడిన చెత్తవాహనం, వెలగని వీధిలైటు

సాక్షి ఫోకస్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెం కమిషనర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ క్రమంలో పాల్వంచ మున్సిపాలిటీ కమిషనర్‌ను కొత్తగూడెం మున్సిపాలిటికి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. దీనివల్ల పనులు, నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఇది ఇలానే కొనసాగితే మున్సిపాలిటీ మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్తగూడెం మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుత కమిషనర్ రెండు మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తుండడంతో కిందిస్థాయి సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని ఆరోపణలున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వారం రోజులకు కూడా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసం ఉంటున్నారు. ప్రతీరోజు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేస్తున్నారు. కూలీలైన్ ఏరియాలోని మసీదు ఎదురుగా, పక్కన ఉన్న కరెంట్ పోల్స్‌కు వీధిలైట్లు వెలగడం లేదని, మసీదుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఫిర్యాదులు చేస్తే మున్సిపల్ సిబ్బంది ఆలస్యంగా స్పందించారు. ఇలా అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం.. వీధుల్లో అంధకారం..

కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డుల్లో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. 200 మంది రెగ్యూలర్, కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రం అయిన తరువాత స్థానికంగా కలెక్టరేట్ రావడంతో జనాభా రాకపోకలు పెరిగిపోయాయి. అదే స్థాయిలో పట్టణంలో చెత్తాచెదరం కూడా పెరిగింది. దీంతో ఇప్పుడున్న మున్సిపాలిటీ కార్మికులు అన్ని వార్డుల్లో పని చేయడం కష్టంగా ఉంది. వార్డుల్లోని ప్రజలు స్థానికంగా ఖాళీగా ఉండే స్థలాలలో చెత్తాచెదారం వేస్తున్నారు. దీని వలన దుర్వాసన, ఈగలు, దోమలు వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్త సేకరించాల్సిన ట్రాలీ ఆటోలు కూడా రెండు, మూడు రోజులకోసారి ఇళ్ల ముందుకు వస్తున్నాయని, కారణం అడిగితే ట్రాలీ మరమ్మతులని, డీజిల్ లేదని కార్మికులు చెబుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్థానికులు ఇళ్ల పక్కనే చెత్త వేస్తున్నారు. ఇక కొత్తగూడెం ప్రధాన రోడ్లపై తప్ప వీధుల్లో చాలా ప్రాంతాలలో వీధిలైట్లు వెలగడం లేదు. కొన్ని స్తంభాలకు అసలు లైట్లే లేవు. ఇదిలా ఉంటే కిన్నెరసాని పంపులు పట్టణంలో రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయి. వేసవికాలం



మున్సిపాలిటీలో పశువుల సంచారం

రావడంతో ప్రస్తుతం నీటి అవసరాలు రెట్టింపు అయ్యాయి. నెలలో రెండు, మూడు సార్లు పైపులైన్ల మరమ్మతులంటూ నీటి సరఫరాను రోజుల తరబడి నిలిపివేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కోతులు, కుక్కలతో అవస్థలు..

కొత్తగూడెం మున్సిపాలిటీలోని దాదాపు అన్నివార్డుల్లో కోతులు, కుక్కలతో ప్రజలు అవస్థ పడుతున్నారు. కోతులు ఇళ్లల్లోకి వచ్చి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎదురుతిరిగితే గాయపరుస్తున్నాయి. ఇక కుక్కలైతే వీధులతో తిరుగుతూ అందరి మీద ఎగబడుతున్నాయి. కోతులను, కుక్కలను పట్టించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కోతులు, కుక్కలను పట్టించాలి..



కొత్తగూడెం పట్టణంలోని అన్ని వార్డుల్లో కోతులు, కుక్కల సంతతి బాగా పెరిగింది. కోతులు ఇళ్లల్లో వచ్చి బీభత్సం చేస్తున్నాయి. బయటి వెళితే కుక్కలు చిన్నాపెద్ద తేడా లేకుండా కరుస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్

నీటి ఎద్దడి లేకుండా చూడాలి...



వేసవికాలంలో మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రెండు, మూడు రోజులకోసారి వార్డుల్లో నీటి సరఫరా జరుగుతోంది. దీని వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు తాగునీటి సరఫరా జరిగేలా చూడాలి.

– రాజేష్, సామాజికవేత్త

విలీన వార్డుల్లో రోడ్లు అధ్వానం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాల్టీలో 4 విలీన వార్డులు ఉన్నాయి. ఈ నాలుగు విలీన వార్డుల్లోనూ అన్నీ కచ్చా రోడ్లే. ఇక తాగునీరు, డ్రెయినేజీ అన్నీ సమస్యలే. పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురం పూర్తిగా సుదిమళ్ల గ్రామపంచాయతీ నుంచి మున్సిపాల్టీలో విలీనం అయింది. ఇక్కడ 450 గృహాలు ఉన్నాయి, 1800 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో దసరా సమయంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అయితే కాలిపోయిన లైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయలేదు. 2వ వార్డు ఇల్లెందులపాడులో సత్యనారాయణపురం నుంచి కొంత భాగం ఈ వార్డులో కలిసింది. ఇక్కడ 350 ఓట్లు 60 ఇళ్లు ఉన్నాయి. అదేవిధంగా 22వ వార్డులో 120 గృహాలు 500 వరకు ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కూడా అత్యధికంగా కచ్చా రోడ్లు ఉన్నాయి. ఇక డ్రెయినేజీలు లేవు. భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాలేదు. అంబేద్కర్ భవన నిర్మాణం కూడా అసంపూర్తిగా ఉంది. 23వ వార్డులో 425 గృహాలు ఉన్నాయి, ఇక్కడ 1270 ఓట్లు ఉన్నాయి. 100 వరకు సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన రోడ్లు తప్ప మున్సిపాలిటీ పట్టించుకునదాఖలాలు లేదు.



సత్యనారాయణపురంలో ఓ వీధిలో కచ్చా రోడ్డు



22వ వార్డులో... అంతర్గత వీధి

వారానికో రోజు తాగునీరు..



సత్యనారాయణపురం 1వ వార్డులో వారానికోసారి తాగునీరు వస్తున్నాయి. కనీసం ఒక్కో ఇంటికి సరిపడా కూడా నీరు ఇవ్వటం లేదు. సత్యనారాయణపురం పల్లెటూరు. రైతులు, కూలీలు పశువులు ఉంటాయి. నీటి వినియోగం అధికంగా ఉంటుంది. అయితే స్థానికులు నీటికి ఇబ్బంది పుడుతూ బయట నుంచి తెచ్చుకుంటున్నారు. ఇక దసరా తర్వాత ఏర్పాటు చేసిన వీధిలైట్లు అరకొరగా ఏర్పాటు చేశారు. చాలా వీధుల్లో కచ్చా రోడ్లు ఉన్నాయి. సీసీ రోడ్లకు నోచుకోలేదు. స్థానికులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పీకే శ్రీనివాస్, సత్యనారాయణపురం

పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి..

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని తీసుకురావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లిలో జరిగిన సీపీఐ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. దేశాభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర ముఖ్యమైందని, దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పిస్తూ దేశ ప్రజలందరికీ అన్నం పెడుతున్న వ్యవసాయ రంగంలో రాను రాను పాలకుల తీవ్ర నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాల రద్దు కోసం 700 మందికి పైగా రైతుల ప్రాణత్యాగం వెల కట్టలేనిదన్నారు. రాష్ట్రంలో అరకొరగా జరిగిన రుణమాఫీని సంపూర్ణంగా పూర్తి చేయాలని, మిర్చి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులను ఆదుకొని మిర్చికి రూ.25 వేల మద్దతు ధర ఇవ్వాలన్నారు. సీతారామ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో సాగులో ఉన్న పోడు, దేవాదయ, బంజర భూమి సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుగులోత్ రాంచందర్, ప్రసాద్, చంద్రయ్య, సోనీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్రకుమార్

తాగునీటి సమస్య పరిష్కరించండి..



దుబ్బతండాలో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న యువకులు



ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివారం జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండా గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. తాగునీటి సమస్యతో గత కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదంటూ వాటర్ ట్యాంకు ఎక్కి యువకులు నిరసన తెలిపారు. మిషన్ భగీరథ ట్యాంకు, పైపులైన్ వేసిన నాటి నుంచి చుక్క నీరు రావడం లేదని, వ్యవసాయ పొలాల్లోని బోరు బావుల నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని, తాగడానికి, ఇంటి అవసరాలకు నీళ్లు లేక ఎన్నో అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాకర్లలో సంపు నిర్మించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చనుందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, జిల్లా నాయకులు దొండపాటి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో ఫోన్‌లో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోరు బావి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి నాని బాబు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని గ్రామ ప్రజలకు అందించారు.

ప్రభుత్వాస్పత్రిలో అదనపు డయాలసిస్ బెడ్లు..

పాల్వంచ: రూ.79లక్షలతో ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధునికీకరణ పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అదనపు ఐదు డయాలసిస్ బెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ... కొత్తగూడెంలో 5, పాల్వంచలో 5 బెడ్లను పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్‌ఎంఓ సోమరాజుదొర తదితరులు పాల్గొన్నారు.

విద్య ఉన్నత లక్ష్యాలకు సోపానం..

పాల్వంచ: విద్య ఉన్నత లక్ష్యాలకు సోపానం అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక సుగుణ గార్డెన్స్‌లో కొత్తగూడెం, పాల్వంచ శ్రీవిద్య స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా ఏకత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... మనం చదువుతున్న పాఠశాలకే చీఫ్ గెస్ట్‌గా వచ్చేంత స్థాయికి, ఆటోగ్రాఫ్ కోసం ఇతరులు వేచి ఉండేంతలా లక్ష్యం ఉండాలన్నారు. బాలలత, డాక్టర్ రమేష్‌బాబు, లీగల్ అడ్వజర్ జీవీకే మనోహర్, పాఠశాల యాజమాన్యం ఎంవీ చౌదరి, కొల్లి రవికుమార్, ఎం.చైతన్యకృష్ణ, వై.నరేష్, ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

‘కేఎల్’ ఆదర్శ ప్రజాప్రతినిధి



నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పదిహేనేళ్ల వయస్సులోనే క్విట్ ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పాఠశాల భవనంపై జాతీయ జెండా ఎగురవేసిన ధీరుడు కేఎల్ నర్సింహారావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి వన్‌లో కేఎల్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో పాల్గొని చిన్న వయస్సులోనే తన దేశ భక్తిని చాటుకున్నారని తెలిపారు.

కమ్యూనిస్టు పార్టీ నుంచి మూడుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా పనిచేశారని, ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారని కొనియాడారు. భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా బండి పట్టాల ఉద్యమం ప్రారంభించి రైతాంగానికి అండగా నిలిచారన్నారు. మద్రాస్ నుంచి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విడిపోతున్న సమయంలో రాష్ట్రానికి ఏం పేరు పెట్టాలనే చర్చ జరుగుతున్న క్రమంలో ఆంధ్ర ప్రదేశ్ అని సూచించింది కేఎల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విత్తనాలు సేకరిస్తున్న విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): వివిధ రకాల మొక్కల విత్తనాలను సేకరిస్తూ, మొక్కలను పెంచుతూ పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో కొత్తగూడెం మున్సిపాలిటీలోని రామవరం పాఠశాల విద్యార్థులు ముందుకెళ్తున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచనల మేరకు విత్తనాలను సేకరిస్తున్నారు. వచ్చే జూన్‌లో విత్తనాలను నాటటం, అటవీ ప్రాంతంలో చల్లటం కార్యక్రమాన్ని హెచ్‌ఎం, ఎంఈఓ ప్రభుదయాళ్ రూపొందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విరివిగా మొక్కలనును నాటటం వల్ల అవి పెరిగి పెద్దవై పర్యావరణాన్ని రక్షిస్తాయన్నారు. ఆ దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత జులైలో పాఠశాల ఆవరణలో నాటిన 120 మొక్కలను సంరక్షిస్తున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతను తవ్వి నీటి సంరక్షణ విధానాలను పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు సామాజిక ఉపయోగ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరిస్తూ ఆయా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



సేకరించిన విత్తనాలతో విద్యార్థులు

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇల్లెందు: కొనుగోలు చేస్తున్న ప్రతీ వస్తువులో నేడు కల్తీ రాజ్యమేలుతోందని, ఇటువంటి పరిస్థితిలో కల్తీ బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆయుర్వేదం సహకరిస్తుందని ఏఎంసీ ప్రతినిధి కోటేశ్వరరావు అన్నారు. ఇల్లెందులో ఆయుర్వేద వైద్యంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. నేడు మనం పీలుస్తున్న గాలి, తింటున్న ఆహారం, తాగుతున్న నీరు అన్నీ రసాయనాలతో మిళితమై ఉన్నాయని వాపోయారు. నేడు వైద్యశాఖకే అందని రీతిలో ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు చెప్పారు.

కల్తీని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు ఆయుర్వేద వస్తువుల వాడకాన్ని ఆ దిశగా అందరి అడుగులు పడాలని సూచించారు. ఎటువంటి దుష్ప్రభావాలు లేని విధంగా ఆయుర్వేద ఉత్పత్తులు ఉంటాయని పేర్కొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాలపై ఆధారపడి యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోకుండా యుద్ధప్రాతిపదికన సాగునీరు అందించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. సత్యనారాయణపురం, యానంబైల్ గ్రామాల మధ్య ఉన్న కిన్నెరసాని ఎడమ కాలువను ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. మాట్లాడుతూ.. ఎడమ కాలువ నీటి సరఫరాపై ఆధారపడి యానంబైల్, రెడ్డిగూడెం, పాండురంగాపురం తదితర గ్రామాల రైతులు యాసంగిలో పంటలను సాగు చేసుకున్నారని కాలువ ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరు చేసేవిధంగా కృషి చేస్తానన్నారు. ప్రత్యామ్నాయంగా మోటార్లను ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎస్‌కె.సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, యర్రంశెట్టి ముత్తయ్య, ఉప్పశెట్టి రాహుల్, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, సతీష్, జకరయ్య, నరహరి నాగేశ్వరరావు, గిరి, సత్యనారాయణ, రేహిమాన్, కరీం, లాల్‌పాషా పాల్గొన్నారు.



కిన్నెరసాని ఎడమ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కిన్నెరసాని ఎడమ కాలువ వద్ద ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరు..

తడారి పోతున్న వరిపంటలను కాపాడుకోవడానికి రైతులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరసాని జలాశయంలో ఆదివారం ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి సాగునీటిని కాలువ ద్వారా పంటలకు సరఫరా కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండల పరిధి యానంబైల్, రెడ్డిగూడెం గ్రామాలకు కిన్నెరసాని ఎడమ కాలువ కింద యాసంగిలో రైతులు సుమారు 300 ఎకరాల్లో వరి సాగుచేశారు. అయితే ఒకవైపు రాళ్లవాగు ప్రాజెక్టులో నీరు అడుగంటింది. కిన్నెరసానిలో కూడా నీటి మట్టం పడిపోవడంతో కాలువలోకి సాగు నీరు సరఫరా జరగక పంటలకు నీరందడం లేదు. దీంతో రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మొరపెట్టుకున్నారు. స్పందించిన మంత్రి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్‌శాఖ అధికారులు నాలుగు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి పంటలకు సాగునీటిని సరఫరా చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1974-76 బ్యాచ్ ఐటీఐ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: రుద్రంపూర్ ఐటీఐలో 1974-76 సంవత్సరంలో ఐటీఐ చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి రాపర్తి వెళ్లే రహదారిలోని గ్రీన్ ఫీల్డ్ ఫామ్‌హౌస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. 50 సంవత్సరాల తరువాత విద్యార్థులంతా కూడా ఒకచోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 16, 17వ తేదీలలో రెండు రోజులు వేడుకలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకునేందుకు, అందరూ ఒకచోట కలవడానికి మూడు సంవత్సరాలు పట్టిందని నిర్వాహకులు కసిరెడ్డి నాగేశ్వరరావు పేర్కొన్నారు.